ఇటుక పరిశ్రమకు గడ్డుకాలం

- ఇసుక కొరతతో కుంటుబడిన నిర్మాణ రంగం
- తగ్గిన ఇటుక ధర
- కొనే నాథుడు కరువు
- బట్టీల్లోనే నిల్వ ఉన్న ఇటుకలు


సిద్ధాంతంలో కాల్చడానికి సిద్ధంగా ఉన్న ఇటుక


వడలిలో ఇటుక బట్టీలు

పెనుగొండ: ఇటుక పరిశ్రమ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుంది. పెట్టిన పెట్టుబడులు ఇటుక బట్టీల్లోనే నిలువలుగా పేరుకు పోతుంది. ఆరేడు నెలలుగా ఇసుక లభ్యత లేకపోవడంతో నిర్మాణ రంగం కుంటుబడడంతో ఇటుకలు కొనే నాథుడే కరువయ్యాడు. ఈ సీజన్‌పై ఆశపెట్టుకొని తయారు చేసిన ఇటుకలను ఎదురుగా ఉంచుకొని బట్టీ నిర్వాహకులు ఆవేదనకు గురవుతున్నారు. నాలుగు నెలలు క్రితం అకాల వర్షంతో పచ్చి ఇటుక మొత్తం నేల పాలై తీవ్ర నష్టాలకు గురయ్యారు. ఈ సీజన్‌పై ఆశ పెట్టుకుని అధిక పెట్టుబడులు పెట్టి మరీ ఇటుకలను తయారు చేశారు. నెల రోజులుగా కనీసం అమ్మకాలు లేకపోవడంతో పడిపోయిన ధరలతో విలవిలలాడుతున్నారు.

రూ.లక్షల్లో పెట్టుబడులు

పెనుగొండ మండలం వడలి, సిద్ధాంతం, ఇలపర్రు, నడిపూడి, దొంగరావిపాలెం ప్రాంతాల్లో 20కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి పదుల సంఖ్యలో కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇటుక తయారీ కోసం పశ్చిమ బెంగాల్ వంటి ప్రాంతాల నుంచి అడ్వాన్సులు చెల్లించి కూలీలను తీసుకొచ్చారు. ఓ మోస్తారు ఇటుక బట్టీకి నిర్వాహకులు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. వడలిలో పెద్ద ఇటుక బట్టీలు ఉన్నాయి. వీరు ఒక్కొక్కరూ కనీసం రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. ఈ నేపథ్యంలో ధరలు తగ్గిపోతుండడంతో విలవిల్లాడుతున్నారు. గతంలో 100 ఇటుకల ధర బట్టీల వద్ద రూ.800 ఉండగా, నేడు రూ.500లోపే అమ్మకాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రకటనలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉచిత ఇసుక పంపిణీ అంటూ ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. ఉచిత ఇసుక అనడంతో నిర్మాణ రంగం వెలిగిపోతుందని ఇటుక బట్టీల నిర్వాహకులు ఆశ పడ్డారు. అయితే, నేటి వరకు ఉచిత ఇసుకకు అతీగతీ లేకుండా పోయింది. గతం కన్నా అధికంగా ధర చెల్లించి ఇసుక తెచ్చుకోవాల్సి రావడంతో ఇళ్ల నిర్మాణాలను వాయిదా వేసుకొంటున్నారు. దీంతో బట్టీల వద్ద ఇటుక నిల్వలు పేరుకు పోయాయి. పెరిగిన తయారీ ఖర్చుతో, తగ్గిన ఇటుక అమ్మకం ధరలతో బట్టీల నిర్వహణ కష్టసాధ్యమేనంటూ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అప్పు చేసి పెట్టుబడి



ఇటుక తయారీకి అప్పు చేసి పెట్టుబడులు పెట్టాం. అమ్మకాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇటుక ధర తగ్గిపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. గతంలో ఎన్నడూ లేనంత నష్టాలు ఎదురవుతున్నాయి. పెద్ద బట్టీల వద్ద రూ.25 లక్షలకు పైగా పెట్టుబడులు అవుతున్నాయి. నిర్మాణ రంగం ఊపందుకోకపోతే ఇబ్బందులు తప్పవు

– యెల్లా సుబ్బారావు, ఇటుక బట్టీ నిర్వాహకుడు, వడలి

ఇటుక నిల్వలు పెరిగిపోయాయి



అమ్మకాలు లేక బట్టీల్లో ఇటుక నిల్వలు పెరిగిపోయాయి. ప్రతి బట్టీలోనూ లక్షల్లో ఇటుక తయారై సిద్ధంగా ఉంది. సీజన్ ప్రారంభమైనా ఇటుక బయటకు వెళ్లడం లేదు. అమ్మకాల కోసం రోజులు లెక్కపెట్టుకొంటూ చూడాల్సిన పరిస్థితి పెట్టుబడి దారులకు నెలకొంది. తీవ్ర సంక్షోభాన్ని ఇటుక పరిశ్రమ ఎదుర్కొంటుంది.

– సోమేష్, వడలి, ఇటుక తయారీదారుడు

క్లుప్తంగా

ఫీజు బకాయిలు చెల్లించాలి


పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీతారామపురంలో మాట్లాడుతూ ఫీజు బకాయిలు పేరుకు పోవడంతో తల్లిదండ్రులకు విద్యా సంస్థల యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరిగి పోతుందన్నారు. ఫలితంగా విద్యార్థుల చదువుపై దృష్టి సారించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఫీజు బకాయిలపై పోరు బాటను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వచ్చే నెల 12కు వాయిదా వేశారని చెప్పారు.

వైద్యానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సూరిబాబు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రామానికి చెందిన పెన్మెత్స పార్వతమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు స్పందించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు చెక్కును క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు చేకూరి సూరిబాబు చేతుల మీదుగా మంగళవారం పార్వతమ్మ భర్త సుబ్బరాజుకి అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, బీఎస్ఎన్ఎల్ రాజు, పచ్చమట్ల శివరామరాజు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలు

పాలకొల్లు అర్బన్: సూర్యుడు ఆరోగ్య ప్రధాత అని, సూర్య నమస్కారాలు చేయడం శరీరం శక్తివంతంగా ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ అన్నారు. రథ సప్తమి సందర్భంగా క్షీరపురి యోగ సత్సంగంలో 60 మంది సభ్యులు 108 సూర్య నమస్కారాలు చేశారు. వీరికి రోటరీ క్లబ్ తరపున అభినందన జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి జవ్వాజి కల్యాణ్, మాజీ అధ్యక్షుడు ముచ్చర్ల సంజయ్, రోటరీ సభ్యులు కోసూరి ఆనందకృష్ణంరాజు, యోగ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ల నిరసన

పాలకొల్లు అర్బన్: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 74 శాతం నుంచి 100 శాతం పెంచుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడాన్ని ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. మంగళవారం భోజన విరామ సమయంలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనలు దేశ ఆర్థిక వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియంపై ప్రస్తుతం వసూలు చేస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీమా శాఖ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి సురేంద్రన్, ఏలియా, బాలాజీ, నాళం బాపిరాజు, న్యూటన్ పాల్గొన్నారు.

సామాన్యులపై బడ్జెట్ భారం

పెనుగొండ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సామాన్యులపై భారం మోపి, సంపన్నులపై వరాలు కురిపించిందని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో అధిక భాగం కార్పొరేట్ల వైపే మొగ్గు చూపిందన్నారు. విభజన చట్ట ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. విశాఖ రైల్వే, విశాఖ స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో నిరుద్యోగులకు ఉద్యోగాలు వంటి ఊసే లేదని తెలిపారు. రాష్ట్రానికి పూర్తిగా తీరని ద్రోహం చేశారని విమర్శించారు. అయినా టీడీపీ కూటమి బడ్జెట్‌పై ప్రశంసలు కురిపించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యుడు నాగిశెట్టి గంగరావు, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుడిమెట్ల వరహాల రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే

నరసాపురం రూరల్: గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని డీఎల్‌డీఓ ప్రభాకరరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఇవోపీఆర్డీ నవీన్ కిరణ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎస్ వెంకటరమణను అరెస్ట్ చేసి, ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సైలు పి మహేష్, జి రఘు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు విరాళం


విద్యార్థికి విరాళం అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు అర్బన్: ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు కారణంగా చదువు మధ్యలో ఆగిపోతున్న విద్యార్థులకు విద్యాచైతన్య సమాఖ్య ఆర్థిక సహాయం చేయడానికి ముందుంటుందని సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అన్నారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన యలమంచిలి మండలం మట్లపాలెంకు చెందిన చెల్లబోయిన లీలా సత్యశ్రీనాథ్ ఐఐటీ చదివేందుకు ఉపాధ్యాయులు మేడిశెట్టి గణేష్, కుక్కల గీతా కల్యాణి, విద్యా చైతన్య సమాఖ్య కలిపి మొత్తం రూ.1.20 లక్షలు ఆర్థిక సాయం అందించారు. సమాఖ్య ఉపాధ్యక్షుడు కింజరాపు దుర్గాప్రసాద్, గైడ్ టీచర్ గణేష్, తోలేటి గాంధీ, వర్ధనపు సందీప్‌కుమార్, జవ్వాది నాగేశ్వరరావు, డీవీవీ ప్రసాద్, చేగొండి కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పాలకొల్లు అర్బన్: స్థానిక హౌసింగ్ బోర్డులో మంగళవారం మునిసిపల్ వాటర్ వర్క్స్‌కి చెందిన పైపులు దగ్ధమయ్యాయి. గాజా ఇంజినీరింగ్ కంపెనీ, హైదరాబాద్ పాలకొల్లులో మునిసిపల్ వాటర్ పైపల్‌లైన్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల పైపులు హౌసింగ్‌బోర్డులో ఒక ప్రైవేటు వ్యక్తి స్థలంలో ఉంచారు. మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను అంటించడంతో పైపులకు నిప్పంటుకుంది. దీంతో సుమారు రూ.92 వేల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. ఫైర్ ఆఫీసర్ కె.జానకిరామయ్య, సిబ్బంది మంటలను అదుపు చేశారు. మునిసిపల్ కమిషనర్ బి.పార్థసారథి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

బీసీ సంఘం నాయకుల చలో ఢిల్లీ


ఢిల్లీ వెళుతున్న బీసీ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: ఈ నెల 6న న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో నిర్వహించే ఓబీసీ రిజర్వేషన్ల చర్చలో పాల్గొనేందుకు పాలకొల్లు నుంచి ప్రతినిధి బృందం పాల్గొంటున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని తెలిపారు. మంగళవారం పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. 110 మంది పార్లమెంట్ సభ్యులు, ఐదుగురు కేంద్ర మంత్రుల సమక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ వెళ్లిన వారిలో కోరుకొండ సంతోషి, అంగర దేవకుమార్, కోరుకొండ సుబ్బారావు, కొప్పర్తి మురళీకృష్ణ, కోట్ల సూర్యనారాయణ, కె.కల్యాణ్, పండు, కృష్ణ ఉన్నారు.

ఏరియా ఆసుపత్రిలో గుండె వైద్య సేవలు


లంకలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పెనుగొండ సీహెచ్‌సీ అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు చంద్ర సవేరీ

పాలకొల్లు అర్బన్: ఏరియా ఆసుపత్రిలో గుండె వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. మంగళవారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండె వైద్యనిపుణుడు కేవైఎస్ వర్మ మాట్లాడుతూ ఎవరికైనా గుండె సమస్యలు, ఛాతిలో నొప్పి, చెమటలు పట్టుట, గుండెల్లో మంట తదితర లక్షణాలు ఉంటే వెంటనే మొదటి మూడు గంటల్లో పాలకొల్లు ఏరియా ఆసుపత్రికి తీసుకొస్తే స్టెమీ ప్రోగ్రాం ద్వారా రూ.60 వేలు విలువైన ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. దీంతో ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని తెలిపారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో క్యాన్సర్ డే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు అడ్డాల ప్రతాప్‌కుమార్, ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన అవసరం

పెనుగొండ : గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించాలని పెనుగొండ సీహెచ్‌సీ వైద్యురాలు చంద్ర సవేరీ అన్నారు. మంగళవారం పెనుగొండ సీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. గుండె పోటు లక్షణాలు, ఛాతీ నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటివి ఉంటాయని తెలిపారు. గంటలోపులో సరైన జాగ్రత్తలు తీసుకొని చికిత్స అందిస్తే రోగిని రక్షించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేకే ప్రమాదాలు


పట్టణంలో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాల్సిన ప్రకాశం రోడ్డు ప్రాంతం

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే స్థానిక స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్ఆర్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం మీదుగా వెళ్లాలి. ముఖ్యంగా పలు కళాశాలల విద్యార్థులు నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. రద్దీ విపరీతంగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని కౌన్సిల్ అధికారంలో ఉండగా పలు సమావేశాల్లో కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కానీ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. స్పీడు బ్రేకర్లు నిర్మింస్తే వాహనాల వేగాన్ని, ప్రమాదాలను నియంత్రించవచ్చని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా సూర్యభగవానుడి కల్యాణం


యర్రంశెట్టివారిపాలెంలో స్వామివారి ఊరేగింపు

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీచాయ ఉషాదేవిసమేత సూర్యభగవానుడి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఉదయం వైభవంగా జరిగింది. అర్చకులు రామకృష్ణశర్మ, వాసు, గణేష్‌శర్మల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సబ్బెళ్ల మోహన సుబ్బారెడ్డి, బాలసాహితి దంపతులు ఈ కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైఎస్ పాలెంలో రథసప్తమి వేడుకలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని రథంపై గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై.నాగముత్యమాంబ, యర్రంశెట్టి బాబులు, బాబ్జి, పాండు రంగ, కొండపరెడ్డి చంటి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నరసాపురం రూరల్: వరి పైరు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి రైతులకు సూచించారు. మంగళవారం ఎల్బీచర్ల, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువగా పురుగు మందులను వాడటం వల్ల మేలు చేసే మిత్ర పురుగులు చనిపోవడంతో పాటు పంటపై శత్రు పురుగుల దాడి ఎక్కువవుతుందని అనిల్‌కుమారి అన్నారు. మండల వ్యవసాయ అధికారి సామ్యూల్ మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. నీటి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుబ్బల మార్రాజు, ఇరిగేషన్ ఏఈ మోహనకృష్ణ, ఏఈఓ లక్ష్మీనారాయణ, వీఏఏ సాయిదుర్గ, కటకంశెట్టి సుభాకరరావు, వాతాడి నారాయణమూర్తి, మిరియాల వెంకటేశ్వరరావు, కటకంశెట్ట మాణిక్యాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అభినందన


మార్టేరులో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు ఇటీవల నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్, కల్చరల్ అండ్ లిటరరీ మీట్ 2025 పోటీల్లో మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో 20 కళాశాలకు చెందిన 375 మంది విద్యార్థులు పాల్గొన్నారని, క్రీడాసాంస్కృతిక కార్యక్రమాల్లో తమ విశేష ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్ అందుకున్నారని వివరించారు. మంగళవారం మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో పీడీ కె.రమేష్, స్టూడెంట్ యాక్టివిటీ వింగ్ ఇన్‌చార్జి ఆర్ సాలేంరాజు, టీచింగ్ అసిస్టెంట్ పి.యశస్విలతో పాటు విద్యార్థులను శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందించారని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, విజయలక్ష్మి సూచించారు. పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల దత్తత గ్రామాలైన యాళ్లవానిగరువు, అడవిపాలెం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించండి, ప్రాణాలను కాపాడుకోండి, వేగం వద్దు, ప్రాణం ముద్దు, భద్రతా నియమాలు పాటించండి, సురక్షితంగా ప్రయాణించండి అంటూ విద్యార్థులు ప్లకార్డులతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అడవిపాలెం పంచాయతీ కార్యదర్శి మాధవి, సచివాలయ ఉద్యోగులు శివప్రకాష్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పెనుమంట్ర: జుత్తిగ షిర్డీసాయిబాబా మందిర 25వ వార్షికోత్సవ పూజలు మంగళవారం నిర్వహించారు. సాయిబాబాకు క్షీరాభిషేకం, పుష్పార్చన చేశారు. 25 ఏళ్ల క్రితం రథసప్తమి రోజున ఈ మందిరంలో గ్రామ ముఖ్య దాత తమనంపూడి వీర వెంకట నాగిరెడ్డి దాతృత్వంతో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఉంటుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొవ్వూరి చిన్నారెడ్డి తెలిపారు.

పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానం


కోవెలగుడి వీధిలో చెత్త కుప్ప

నరసాపురం: స్థానిక మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారింది. 31 వార్డులు, 60 వేలు జనాభాతో విస్తరించి ఉన్న పట్టణంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో పూర్తి అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా ప్రధానమైన మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్డుపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆవులు, దూడలు, పందులు రోడ్లపై సంచరిస్తున్నాయి.